సాక్షి జగిత్యాల

శనివారం ׀ 21 ׀ అక్టోబర్ ׀ 2023

బో'నమో' తల్లీ

మెట్‌పల్లి(కోరుట్ల): శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని సుభాష్‌నగర్‌లో శుక్రవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో దుర్గామాతకు బోనాలు సమర్పించారు. ఇంటికో బోనంతో ఊరేగింపుగా మండపం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఉత్సవాల్లో న్యాయమూర్తులు, మహిళలు

జగిత్యాలజోన్: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టులో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా మొదటి అదనపు జడ్జి నారాయణ, సబ్ జడ్జి ప్రసాద్, మొదటి అదనపు జడ్జి జితేందర్ ప్రారంభించారు. అనంతరం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజతో పాటు కోర్టులోని మహిళా ఉద్యోగులు, న్యాయవాదుల సతీమణులు బతుకమ్మ చుట్టు తిరుగుతూ ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ వేడుకలు జరుపుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, ఉపాధ్యక్షుడు మహేంద్రనాథ్, కోశాధికారి కటుకం చంద్రమోహన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు కవిత రాక



కవిత, ఎమ్మెల్సీ

జగిత్యాల: నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. కోరుట్లలో మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటారు. అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడనున్నారు.

విపక్షాల దుష్ప్రచారం నమ్మొద్దు



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే

మల్లాపూర్(కోరుట్ల): బీఆర్‌ఎస్‌పై విపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని రాఘవపేటకు చెందిన బీజేపీ యూత్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌తో కలిసి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందించిన ఘనత సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. దేశంలో అన్నిరంగాల్లో అద్భుత ప్రోగతి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్‌కు పట్టం కడుతారని జోస్యం చెప్పారు. ఏలాగైన అధికారంలోకి రావాలని బీఆర్‌ఎస్‌పైన, ప్రభుత్వంపైన విపక్షాలు పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నాయని, వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌ను భారీ మేజార్టీతో గెలుపించుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణకు ప్రత్యేక నిఘా

జగిత్యాలక్రైం: దసరా సందర్భంగా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఇదే సమయంలో దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉందని దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దసరా పండగ సమయంలో ఎటు వెళ్లినా ఇంట్లో విలువైన వస్తువులు ఉంచవద్దన్నారు. దొంగతనాల నియంత్రణకు పటిష్టచర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండలన్నారు. ఇళ్లలో బంగారం, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. బయటకు వెళ్తున్న సమయంలో ద్విచక్రవాహనాలు, కార్లలో విలువైన వస్తువులను ఉంచకూడదన్నారు. గ్రామాల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే సమయంలో ఇంటో లైట్లు వేసి ఉంచాలన్నారు. అనుమానితులు కనిపిస్తే 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

సర్పంచ్, వీడీసీ సభ్యులపై ఫిర్యాదు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మండలంలోని ఆత్మనగర్ సర్పంచ్, వీడీసీ సభ్యులపై రామలచ్చక్కపేట వాసులు మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి చెందిన ఓ భూమికి సంబంధించిన విషయంలో తమ గ్రామస్తులను ఆత్మనగర్ సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ విజయ్, వీడీసీ సభ్యులతో పాటు మరికొంతమంది బెదిరింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని వారందరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అందరికీ అభయ హస్తం

- ఉమ్మడి జిల్లాలో ముగిసిన విజయభేరి యాత్ర
- కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం
- అధిక సంఖ్యలో హాజరైన కార్యకర్తలు, ప్రజలు
- జీవన్‌రెడ్డిని అభినందించిన రాహుల్



జగిత్యాలకు చేరుకుని ప్రజలకు అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్/జగిత్యాల/కొత్తపల్లి/మల్యాల: రాహుల్‌గాంధీ విజయభేరి యాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. పెద్దపల్లి జిల్లాలో గురువారం మంథని వద్ద ప్రవేశించిన రాహుల్‌గాంధీ యాత్ర.. శుక్రవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మీదుగా నిజామాబాద్ జిల్లాలో ప్రవేశించింది. కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తూ.. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం విధానాలను ఎండగడుతూ రాహుల్‌గాంధీ ముందుకుసాగారు. కాంగ్రెస్ కార్యకర్తలను బెబ్బులితో పోలుస్తూ ఉత్సాహం నింపారు. అత్యవసర పనులు ఉండడంతో గంగాధర కార్నర్‌మీటింగ్, కొండగట్టు దర్శనం రద్దయ్యాయి. అయినా.. ఆయా ప్రాంతాల్లో ఎదురుచూస్తున్న స్థానికులను, పార్టీ కార్యకర్తలను పలకరిస్తూ ముందుకుసాగారు.

దోశ వేసిన రాహుల్‌గాంధీ

జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారం, నూకపల్లి న్యాక్ బస్టాండ్ వద్ద మొబైల్ టిఫిన్ సెంటర్‌లో రాహుల్‌గాంధీ దోశ వేశారు. దోశ తింటూ స్థానికులతో ముచ్చటించారు. దంపతులను మాట్లాడించి, వారి పిల్లలకు చాక్లెట్స్ ఇచ్చా రు. గౌడసంఘం నాయకులు మోకు అందజేశా రు. జగిత్యాల కొత్తబస్టాండ్‌కు చేరుకోగా.. అప్పటికే అక్కడికి భారీగా వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు.. 'రాహుల్ పీఎం..' అంటూ నినాదాలు చేశారు. బస్సు ఎక్కిన రాహుల్‌గాంధీ దాదాపు 36 నిమిషాలపాటు ప్రసంగించారు. జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డిని, ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తన ప్రసంగాన్ని తెలుగులో బాగా అనువదించారని జీవన్‌రెడ్డిని రాహుల్‌గాంధీ అభినందించారు. రాహుల్ వెంట టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నాయకులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మధుయాష్కీగౌడ్, శ్రీధర్‌బాబు, మాణిక్ రావుఠాక్రే, వేణుగోపాల్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జగిత్యాల నుంచి కోరుట్ల వైపు..

రాహుల్‌కు మేడిపల్లిలో వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్ వేములవాడ రాజన్న ప్రసాదం అందించారు. కోరుట్లలో భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు నర్సింగారావు, కోమటిరెడ్డి కరంచంద్, కృష్ణారావు, సుజిత్‌రావు స్వాగతం పలికారు. కోరుట్ల శివారులోని ముక్క కన్వెన్షన్ సెంటర్‌లో భోజనం చేసి మెట్‌పల్లికి వెళ్లారు. కారులో నుంచే ప్రజలకు అభివాదం చేస్తూ ఆర్మూర్ బయలుదేరి వెళ్లారు.

దొంగల బెడద

యాత్రలో కార్యకర్తలకు దొంగల బెడద వెంటాడింది. జగిత్యాలతోపాటు మేడిపల్లిలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. జగిత్యాల కొత్తబస్టాండ్‌లో భారీ సంఖ్యలో ప్రజలు గుమిగూడడంతో దొంగలు చేతివాటం ప్రదర్శించారు.

హోటల్ వద్ద సందడి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లో గురువారం రాత్రి రాహుల్‌గాంధీ స్థానిక హోటల్-వీ పార్క్‌లో బసచేశారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు, నాయకులు శుక్రవారం ఉదయం భారీగా హోటల్ వద్దకు చేరుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సైతం రావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, మాణిక్‌రావుఠాక్రే, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మధుయాష్కీ హోటల్‌లోనే బసచేశారు. రాహుల్‌ను కలిసేందుకు ఉదయమే ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, రాజయ్య, మాజీ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వంశీచందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణతోపాటు స్థానిక నాయకులు హోటల్ వద్దకు వచ్చారు. తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరాంతో రాహుల్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

'సేవ్ కాంగ్రెస్..సేవ్ చెన్నూర్' అంటూ..

హోటల్ ఎదుట చెన్నూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. 'రాహుల్ గాంధీకి జై.. సేవ్ కాంగ్రెస్..సేవ్ చెన్నూర్'.. అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. గమనించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వారికి నచ్చజెప్పారు.

సెంచరీ కొడతాం

అసెంబ్లీ ఎన్నికల్లో సెంచరీ కొట్టి అధికారంలోకి వస్తామని నల్గొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ బసచేసిన కరీంనగర్‌లోని హోటల్ వీ-పార్క్ వద్దకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, ప్రజలు వారిని తిరస్కరించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఉచిత విద్యుత్ ఘనత కాంగ్రెస్‌దే

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్సీ, జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల కార్నర్ మీటింగ్‌లో ముందుగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



జగిత్యాలలో బైక్‌పై వస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



జగిత్యాలలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం



రాహుల్ గాంధీకి మోకు అందించిన గౌడన్న



మల్యాల వద్ద దోశ తింటూ.. ముచ్చటిస్తూ..



కోరుట్లలో రాహుల్ రాకకోసం..

రాహుల్‌గాంధీ రోడ్‌షో అట్టర్‌ఫ్లాప్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ నిర్వహించిన రోడ్‌షో అట్టర్‌ఫ్లాప్‌గా నిలిచిందని, జనాలు రారని గ్రహించి ఇరుకైన ప్రాంతంలో ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, గ్రామాల నుంచి కనీసం 10 మంది కూడా రాలేదని, జగిత్యాల పట్టణం నుంచి సైతం ప్రజలు హాజరు కాలేదన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి అబాసుపాలయ్యారని పేర్కొన్నారు. మార్గమధ్యలో నూకపల్లి వద్ద నిర్మించిన పేదోడి ఆత్మగౌరవ ప్రతీక అయిన రెండుపడకల గదులను చూడాల్సి ఉంటే బాగుండేదన్నారు. అలాగే 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉండి షుగర్ ఫ్యాక్టరీని ఎందుకు తెరిపించలేదో ప్రజలకు వివరించేది ఉండేదన్నారు. పసుపు బోర్డుకు సైతం నాడే ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ప్రజలు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నేల ఆరోగ్యం కాపాడితేనే దిగుబడులు



నేల ఆరోగ్యంపై రైతులకు వివరిస్తున్న ప్రొఫెసర్లు

జగిత్యాలఅగ్రికల్చర్: నేల ఆరోగ్యాన్ని కాపాడితేనే పంటల్లో దిగుబడులు సాధ్యమని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతీనారాయణ్‌భట్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాలలో నేల సంరక్షణ, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ఒకరిని చూసి మరొక్కరు అవసరం ఉన్నా, లేకున్నా రసాయన ఎరువులను ఇష్టారీతిగా చల్లుతున్నారన్నారు. భూమికి సత్తువ ఇచ్చేందుకు పశువులు, గొర్రెల ఎరువు అందించాలని పేర్కొన్నారు. అధిక రసాయన ఎరువులతో భూములు చౌడు నేలలుగా మారి, పంటలకు ఉపయోగం లేకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సమగ్ర ఎరువుల యాజమాన్యంపై డాక్టర్ వేణుగోపాల్, వరి తర్వాత ఆరుతడి పంటల సాగుపై డాక్టర్ మహేశ్, పొలాల్లో డ్రోన్ల వాడకంపై డాక్టర్ సాయికుమార్, క్షేత్రస్థాయిలో పంటల సాగులో అనుసరించాల్సిన పద్ధతులపై డాక్టర్ ఎల్లాగౌడ్ వివరించారు. రామగుండం నేషనల్ ఫర్టిలైజర్ లిమిటెడ్ అధికారులు సురేశ్‌కుమార్, టీకే జయన్, కె.సురేశ్, దత్తత గ్రామ సర్పంచ్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

కలెక్టర్ యాస్మిన్‌బాషా



ఈవీఎంల గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, తదితరులు

జగిత్యాల: రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ పాట్స్‌ల మొదటి రాండమైజేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్స్ (ఈవీఎం) కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశామని వివరించారు. ఆయా మెటీరియల్స్‌ను సంబంధిత నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూములకు పోలీస్ భద్రత మధ్య తరలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, దివాకర, ఆర్డీవోలు రాజేశ్వర్, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీ సహజం

జగిత్యాలరూరల్: ఉద్యోగస్తులకు బదిలీ సాధారణమని జిల్లా అదనపు ప్రాజెక్ట్ సంచాలకులు శ్రీకర్ సుధీర్ అన్నారు. జగిత్యాల రూరల్ మండల టీ సెర్ప్ కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న సంతోష్, కోరుట్ల మండలానికి చెందిన రాజేందర్, కథలాపూర్ మండలానికి బదిలీ కాగా వారిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉద్యోగధర్మంలో బదిలీలు సహజమని, వృత్తిపట్ల అంకితభావం, సమాజంలో ఉన్న ఆధరాభిమానాలు సంపాధించుకోవడం గొప్ప విషయమన్నారు. మంచి ప్రగతి సాధించడంలో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేశ్, ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, విద్యాసాగర్, గంగాధర్, మరియ, గంగాధర్ తదితరులుయ పాల్గొన్నారు.

24 గంటల్లో రూ.15.67 లక్షలు స్వాధీనం

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: రాష్ట్ర శాసన సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పరిధిలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తునామని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గడిచిన 24 గంటల్లో వాహనాల తనిఖీల్లో రూ.15,67,380 నగదు, రూ.1,08,654 విలువ గల 254.87 లీటర్ల మద్యం సీజ్ చేయడం జరిగిందన్నారు. అలాగే రూ.7,57,670 విలువ గల ఇతర వస్తువులు 1,078, చీరలు 200, తెల్లచొక్కాలు 132, హ్యాండ్‌బ్యాగ్స్ 40, హాట్‌బాక్సెస్ 270 పట్టుకొని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లా పరిధిలో ఎవరైనా ఎక్కువ డబ్బు తీసుకెళ్లరాదని, ఒక వేళ తీసుకెళ్తే రశీదు, తగిన పత్రాలు, వాటి వివరాలు ఉండాలని అన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100, లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే ఎన్నికల నియమావళి ప్రకారం ప్రకారం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.

కాత్యాయిని రూపంలో అమ్మవారు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారు కాత్యాయిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని దమ్మన్నపేట వీరభద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మండపంలో చండీ హోమం ఘనంగా నిర్వహించారు.





స్వామివారికి గజవాహన సేవ

సారంగాపూర్(జగిత్యాల): శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారికి గజవాహన పల్లకిసేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ నేరెల్ల సుమన్‌గౌడ్, అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, కాసం మల్లేశం తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో అమ్మవారు సరస్వతిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.



గరుడ వాహనంపై వేంకటేశ్వరుడు

ధర్మపురి: శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం వేంకటేశ్వరస్వాములను గరుడ వాహనంపై పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

క్లుప్తంగా

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మెట్‌పల్లి(కోరుట్ల): ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి కథనం ప్రకారం.. పట్టణంలోని గాజులపేటకు చెందిన ఎక్కల్‌దేవి విశాల్(27) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కొంతకాలంగా ఉద్యోగానికి సంబంధించిన కార్యకలాపాలు ఇంటి వద్ద నుంచే నిర్వహిస్తున్న విశాల్ మానసికంగా ఇబ్బందులు పడుతూ ఒత్తిడికి గురయ్యాడు. ఒత్తిడి భరించలేక శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. విశాల్‌కు గత మార్చిలో వివాహం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అతివేగంతో హెడ్ కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన వ్యక్తి


ప్రమాదంలో గాయపడిన హెడ్ కానిస్టేబుల్

వెల్గటూర్(ధర్మపురి): ఎన్నికల విధుల్లో భాగంగా వాహనాల తనిఖీ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్‌ను ఓ వ్యక్తి ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. స్థానికుల వివరాలు.. ధర్మారం నుంచి వెల్గటూర్ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న దండెపల్లి మండల కేంద్రానికి చెందిన కట్కూరి సతీశ్ వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట స్టేజీ వద్ద విధి నిర్వహణలో భాగంగా వాహనాల తనిఖీ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ బహదూర్‌ను అతివేగంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన హెడ్ కానిస్టేబుల్‌ను పోలీసులు చికిత్స నిమిత్తం కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన సతీశ్ స్వల్పంగా గాయపడగా ధర్మారం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని బట్టపల్లికి చెందిన కొక్కుల సురేశ్‌కు విద్యుత్ చౌర్యం కేసులో న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ఉమ్మడి జిల్లా విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సురేశ్ తన ఇంటికి విద్యుత్ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగించాడు. అతన్ని పట్టుకున్న అధికారులు మొదటి నేరంగా భావించి, రూ.1,000 జరిమానా విధించి వదిలేశారు. సురేశ్ రెండోసారి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన అధికారులు, అతన్ని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.నారాయణ ఎదుట సురేశ్‌ను హాజరుపర్చగా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో జడ్జి అతనికి రూ.83,390 జరిమానా చెల్లించాలని లేదంటే ఆరు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించారు. సీఐ వెంట ఎస్సై టి.నరేశ్, విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు.

నాటుబాంబు పేలి ఆవుకు గాయాలు

కోనరావుపేట(వేములవాడ): అటవీ జంతువుల కోసం పెట్టిన నాటుబాంబు పేలి ఆవు గాయపడింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం గొల్లపల్లి(వట్టిమల్ల) శివారులోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద భుక్యా రూప్‌సింగ్ అనే రైతు తన ఆవును మేత కోసం తీసుకొచ్చాడు. ఆవు మేత మేసుకుంటూ వెళ్లగా గడ్డిలో బాంబును నోటకర్చుకోగానే అది పేలింది. ఈ ప్రమాదంలో ఆవు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా గొల్లపల్లి, వట్టిమల్ల గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కొందరు వేటగాళ్లు కొంతకాలంగా వన్యప్రాణులను వేటాడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వన్యప్రాణుల వేట జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు స్పందించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. కోనరావుపేట పోలీసులు చేరుకుని సంఘటన స్థలాన్ని సందర్శించారు.

వారం రోజులైనా తగ్గుతలే..

- వేంపేటలో విషజ్వరాల విజృంభణ
- ఇంట్లో ఇద్దరి నుంచి ముగ్గురు బాధితులు
- విలవిల్లాడుతున్న జనం



'ఈమె పేరు కావ్యశ్రీ. ఊరు వేంపేట. ఏడు రోజుల కిందట ఈమెకు జ్వరం రాగా, సాధారణ జ్వరం అనుకొని మందులు వాడింది. ఎంతకూ తగ్గకపోవడంతో మెట్‌పల్లిలోని ఓ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుంది. డెంగీగా నిర్ధారణ కావడంతో చికిత్స తీసుకుంటుంది'.


మెట్‌పల్లిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. కొద్ది రోజులుగా ప్రబలుతున్న జ్వరాలతో జనం ఆందోళన చెందుతున్నారు. దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, జ్వరంతో విలవిల్లాడుతున్నారు. వారం, పది రోజులైన జ్వరాలు తగ్గకపోవడంతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. కొందరు వైరల్ జ్వరం, మరికొందరు డెంగీ బారిన పడుతున్నారు.

పెరుగుతున్న జ్వరపీడితులు

మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలను విషజ్వరాలు కలవరపెడుతున్నాయి. వేంపేట గ్రామంలో చాలా మంది జ్వరాలతో బాధపడుతున్నారు. రోజురోజుకు బాధితులు పెరుగుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతుంది. ఏ ఇంట్లో చూసినా చిన్న పెద్ద తేడా లేకుండా జ్వరాలతో సతమతమవుతున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కొంతమంది, జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్‌లోని ఆసుపత్రుల్లో మరికొంత మంది చికిత్స తీసుకుంటున్నారు. కొద్దిరోజుల క్రితం వైద్య శాఖ అధికారులు గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి పరీక్షించగా 35 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు తేలింది. ఇంతే కాకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లో పదుల సంఖ్యలో బాధితులు పరీక్ష చేయించుకోగా వైరల్ లేదా డెంగీగా నిర్ధారణ అవుతోంది.

పారిశుధ్య లోపమే కారణమా..?

జ్వరాల విజృంభణకు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండడమనే కారణమని తెలుస్తోంది. పారిశుధ్య లోపం కారణంగా దోమలు స్వైర విహారం చేయడంతో ప్రజలను వ్యాధులు చుట్టుముడుతున్నాయి. అంతేకాకుండా వాతవరణంలో మార్పుల వల్ల కూడా జ్వరాలు వసున్నాయని, ఏ మాత్రం అనారోగ్యంగా అనిపించినా నేరుగా డాక్టర్లను సంప్రదించాలని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇంట్లో ఇద్దరికీ జ్వరాలు



మా ఇంట్లో నాకు, నా భార్యకు జ్వరం వచ్చింది. ఒళ్లు నొప్పులు, తీవ్రమైన జ్వరం ఉండడంతో వైద్యున్ని సంప్రదించాం. డెంగీ వచ్చిందని చెప్పడంతో చికిత్స తీసుకుంటున్నాం.

– లచ్చయ్య, వేంపేట

పారిశుధ్య చర్యలుండాలి



వేంపేటలో చాలామంది జ్వరాలతో బాధపడుతున్నారు. వైరల్, డెంగీ జ్వరాలు రావడంతో ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. అధికారులు గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి. విషజ్వరాల విషయమై డీఎంహెచ్‌వో దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– అల్లూరి మహేందర్‌రెడ్డి, వేంపేట

వైద్యం శిబిరం ఏర్పాటు చేస్తాం



వేంపేటలో విషజ్వరాలు వస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. కొద్ది రోజుల క్రితం వైద్య పరీక్షలు చేయగా గ్రామంలో 35 మందికి జ్వరం వచ్చినట్లు గుర్తించాం. మరోమారు శిబిరం ఏర్పాటు చేస్తాం. పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తాం.

– అంజిత్‌రెడ్డి, మండల వైద్యాధికారి, మెట్‌పల్లి

పకడ్బందీగా ఎన్నికల నియమావళి

- అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు


ఏఎస్పీ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

పెగడపల్లి(ధర్మపురి): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం పెగడపల్లిలో అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.1.50 లక్షలు పట్టుకుని ఎఫ్‌ఎస్టీ టీంకు అప్పగించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నగదు, మద్యంతో పాటు ఉచిత పంపిణీపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ జరుగుతుందని, ఎవరూ ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడవద్దని, పట్టుబడితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. వాహనాల తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మల్యాల సీఐ బిల్ల కోటేశ్వర్, ఎస్సై చిర్ర సతీశ్, ఏఎస్సై సత్తయ్య, పోలీసులు పాల్గొన్నారు.

రాయపట్నం వద్ద..

ధర్మపురి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ధర్మపురి మండలంలో శుక్రవారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు సీఐ రమణామూర్తి ఆధ్వర్యంలో మండలంలోని రాయపట్నం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా పలువురు వ్యక్తుల నుంచి ఆధారాలు లేనటువంటి రూ.23,18,100 నగదును పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు అప్పజెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ, ఎఫ్‌ఎస్‌టీ టీం ఇన్‌చార్జి హరీశ్, సిబ్బంది తదితరులున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమణామూర్తి

చల్‌గల్ శివారులో..

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ శివారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.80 వేల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్–2 అధికారి కుమారస్వామి శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఓ వ్యక్తి ఎలాంటి రశీదు లేకుండా నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్‌లో వాహనాలు తనిఖీలు చేస్తుండగా నగదు పట్టుబడినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలో రూ.2 లక్షల 70 వేలు తరలిస్తుండగా పట్టుబడిందని, నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో ఆ మొత్తాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడులు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మండలంలోని వేంపేటలో శుక్రవారం ఓ బెల్ట్‌షాపుపై పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన శేఖర్‌గౌడ్ షాపులో దాడులు నిర్వహించి రూ.7,250 విలువ గల మద్యం పట్టుకున్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

రామాజీపేటలో ..

రాయికల్(జగిత్యాల): మండలంలోని రామాజీపేట గ్రామంలో శుక్రవారం బెల్టు షాపుపై ఎస్సై అజయ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. రూ.20 వేల విలువ గల మద్యం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

- రెండు లీటర్ల సారా పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండాలో సారా తయారు చేస్తున్న వ్యక్తి ఇంటిపై దాడి చేసి రెండు లీటర్లసారాను స్వాధీనం చేసుకున్నామని హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య శుక్రవారం తెలిపారు. ధరంసోత్ మాన్‌సింగ్(45) ఇంట్లో సారా తయారు చేస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించామన్నారు. మాన్‌సింగ్ వద్ద రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో రెండేళ్ల జైలు

జగిత్యాలజోన్: వివాహితపై అత్యాచారయత్నం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కంచ ప్రసాద్ శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిల్ల మురళి కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను భర్త వదిలివెళ్లడంతో ఇద్దరు పిల్లలతో కలిసి ఒంటరిగా ఉంటోంది. ఇంటి వద్దే కిరాణం షాపు పెట్టుకుని జీవితం సాగిస్తుంది. రోజూ మాదిరిగానే పిల్లలతో కలిసి తన ఇంట్లో రాత్రి నిద్రిస్తుండగా, అదే గ్రామానికి చెందిన తన బంధువైన బొద్దుల రాజేందర్ మే 10, 2019న అర్ధరాత్రి ఇంటికి ఉండే కిటికీని తీసివేసి సదరు మహిళ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి అత్యాచారానికి ప్రయత్నించాడు. వివాహిత కేకలు వేయడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో గాయపర్చాడు. దీంతో పిల్లలు, చుట్టుపక్కల ఇళ్లవారు లేవడంతో రాజేందర్ పారిపోయాడు. జరిగిన సంఘటనపై బాధితురాలు జగిత్యాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేయగా, అప్పటి ఎస్‌ఐ సతీశ్ కేసు దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు శ్రీధర్, రామకృష్ణ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితుడైన బొద్దుల రాజేందర్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

ఆటో బోల్తా : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ శివారులో ఆటో బోల్తా పడి, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సైదాపూర్ మండలం చింతలపల్లికి చెందిన దున్నపోతుల సతీశ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఆటోలో సింగాపూర్ వైపు వెళ్తుండగా అదుపు తప్పి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుడికి గాయాలు

రామగిరి: ఆర్జీ–3 డివిజన్‌లోని ఏపీఏ గనిలో శుక్రవారం జనరల్ షిఫ్ట్‌లో జరిగిన ప్రమాదంలో కార్మికుడు బానోతు నరేశ్ గాయపడ్డాడు. 91 లెవల్ ఏఎం 100 ప నిస్థలంలో హెయిర్ డక్కులు కడుతుండగా అవి జారి నరేశ్‌పై పడ్డాయి. దీంతో మెడ వద్ద తీవ్రగాయాలు కావడంతో వెంటనే గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్.. నరేశ్‌ను పరామర్శించారు. అనుభవంలేని బదిలీ వర్కర్లతో పనులు చేయించడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని రియాజ్ అహ్మద్ ఆరోపించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


నర్సమ్మ (ఫైల్)

రామగుండం: అంతర్గాం మండలం ఎల్లంపల్లికి చెందిన ఆరుముళ్ల నర్సమ్మ(106) శుక్రవారం వయోభారంతో బాధపడుతూ మృతిచెందింది. గోదావరి నదిపై రైలువంతెన నిర్మించిన సమయంలో తన వయస్సు ఆరేళ్లు అని తన కూతురు పుష్పలత ఇంట్లో ఇటీవల జరిగిన శుభకార్యానికి హాజరైన సందర్భంగా వృద్ధురాలు తెలిపింది. ఇప్పటిదాకా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వృద్ధురాలు వయోభారంతో మృతిచెందడంపై గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భర్త పోశయ్య 50 ఏళ్ల క్రితమే మృతిచెందాడు. వారికి ఒకే ఒక కూతురు ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం: కరీంనగర్ వన్‌టౌన్ పరిధి గంజ్ ప్రాంతంలోని డ్రైనేజీ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు శు క్రవారం గుర్తించారు. అతని వయసు సు మారు 60 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరి సంబంధీకులైనా కనిపించకుండాపోతే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కోరుట్లలో రాహుల్‌కు ఘన స్వాగతం


రాహుల్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

- సమస్యలపై వినతిపత్రం ఇచ్చిన నర్సింగరావు

కోరుట్ల: జగిత్యాలలో రోడ్ షో ముగించుకొని కోరుట్లకు చేరుకున్న రాహుల్‌గాంధీకి కొత్త బస్టాండ్ వద్ద కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. రాహుల్‌గాంధీ కారు లోనుంచే అభివాదం చేస్తూ పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. అక్కడ టీపీసీసీ డెలిగేట్ జువ్వాడి నర్సింగరావు ముత్యంపేట చక్కెర కర్మాగారం తెరిపించాలని, గల్ఫ్ బాధితులకు అండగా నిలవాలని, పసుపు పంటకు మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన రాహుల్‌గాంధీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. అలాగే స్థానిక న్యాయవాదులు 41 ఏ సీఆర్‌సీసీ నిలిపివేయాలని విన్నవించగా, ప్రభుత్వం ఏర్పాటు కాగానే పరిశీలిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఫంక్షన్‌హాల్‌లోనే భోజనం చేసి మెట్‌పల్లి పయనమయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతీదేవి, నాయకులు కల్వకుంట్ల సుజీత్‌రావు, జువ్వాడి కృష్ణారావు, కొమిరెడ్డి కరమ్, విజయ్ ఆజాద్, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కారులోనుంచి అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ

భారీ బందోబస్తు

జగిత్యాలక్రైం: జిల్లాలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రోడ్‌షోకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అణువణువు తనిఖీ చేపట్టడంతో పాటు, ఆయన ప్రసంగించే ప్రదేశాన్ని పోలీసులు ఆధీనంలో తీసుకున్నారు. కొత్తబస్టాండ్ ప్రాంతంలో రాహుల్‌గాంధీ ప్రసంగించే వాహనం వైపు కేవలం ప్రముఖులను మాత్రమే అనుమతించారు. సభ జరిగినంత సేపు కరీంనగర్ నుంచి వచ్చిన వాహనాలను చిన్న కెనాల్ నుంచి నటరాజ్ చౌరస్తా మీదుగా తరలించగా, ధర్మపురి, గొల్లపల్లి వైపు వెళ్లే వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు.


జగిత్యాలలో సభ వైపు వాహనాలు వెళ్లకుండా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం

- ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు, సొంత పార్టీ అనుకూల అంశాలకు వేదికగా సోషల్ మీడియా

కథలాపూర్(వేములవాడ): గతంలో ఎన్నికల ప్రచారం అంటే వాహనాలకు మైకులు, డప్పు చప్పుళ్లు, వాల్‌పోస్టర్, వాల్‌రైటింగ్ ఉండేవి. ఈ ఎన్నికల్లో వాటికి బదులు సోషల్ మీడియాను ప్రచారానికి ఆయా రాజకీయపార్టీలు వినియోగించుకుంటున్నాయి. ఆధునిక టెక్నాలజీతో యువత సహకారంతో రాజకీయ నాయకులు కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా పలువురు నాయకులు ఇప్పటికే విడివిడిగా గ్రూపులు ఏర్పాటు చేసి తమ అభ్యర్థి, పార్టీ విధానాలను వివరిస్తూ పోస్టులు పెడుతున్నారు. మారుమూల గ్రామాల్లో స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగి ఇంటర్నెట్ సౌకర్యం ఉండటంతో రాజకీయ నాయకులకు సైతం ప్రచారాలకు కలిసి వచ్చినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను సోషల్ మీడియాలో ఎండగడుతూ పోస్టులు పెడుతుండటం విశేషం. ఆయా పార్టీల మేనిఫెస్టోలను సైతం సోషల్ మీడియాలో పెట్టి అభిప్రాయాలు తెలపాలని, మెజార్టీ ప్రజలను ఆకర్షించిన మేనిఫెస్టోలోని అంశం ఏదీ అనేది తెలుసుకొని ఎమ్మెల్యే అభ్యర్థులు ఆయా గ్రామాల ప్రచారంలో వివరించడానికి దోహదపడుతుందని నేతలు అంటున్నారు. తక్కువ ఖర్చుతో ప్రచారం నిర్వహిస్తూ తమ ఉనికిని చాటేందుకు సోషల్ మీడియాను అన్ని రాజకీయపార్టీలు వినియోగించుకోవడం గమనార్హం.

కాంగ్రెస్‌ను ఆదరించండి

ధర్మపురి: కాంగ్రెస్‌ను ఆదరిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని పెద్దపెల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యుడు మోహన్‌జోషి అన్నారు. ధర్మపురి పట్టణంలో శుక్రవారం మున్నూర్‌కాపు సంఘం పట్టణ అధ్యక్షుడు చిపిరిశెట్టి రాజేశ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువకులు మోహన్‌జోషి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల కష్టాల్లో పాలు పంచుకుంటూ, ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిషలు కృషి చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.దినేశ్, సింహరాజు ప్రసాద్, వేముల రాజేశ్, రఫియొద్దీన్, సుముక్, తిరుపతి తదితరులున్నారు.


మోహన్‌జోషి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మున్నూరుకాపు సంఘం యువకులు

కార్యకర్తలు సమష్టిగా పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

- కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): ఎన్నికల వేళ బీజేపీ కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం కథలాపూర్ మండలం చింతకుంట గ్రామంలో బీజేపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని వివరించాలన్నారు. బూత్‌ల వారీగా కార్యకర్తలు ప్రచారం చేయాలని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందని, పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు ఎద్మల వినోద్‌రెడ్డి, మల్యాల మారుతి, ఉత్కం విష్ణు, శ్రీహరి, సాయి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మై ఓట్.. నాట్ ఫర్ సేల్'

- వాట్సాప్, స్టేటస్ చిత్రంగా ఉపయోగిస్తున్న ఓటర్లు

పెగడపల్లి(ధర్మపురి): 'మై ఓట్.. నాట్ ఫర్ సేల్' అనే చైతన్య నినాదం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఇందులో ఏముంది ప్రత్యేకత అనుకుంటున్నారా.. ఇది ఎన్నికల సంఘం రూపకల్పన చేసినట్లు ముద్రించి ఉంది. ఈ నినాదం అధికారిక పిలుపు అయితే ఇదొక శుభ పరిణామం. ఓటు కోసం రూ. 500 ఇస్తుండగా తిరస్కరిస్తున్నట్లు అర్థం వచ్చేలా తీర్చిదిద్దడంతో అందరి దృష్టిని ఆకర్శిస్తోంది. దీనిని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారు. చూసిన చాలా మంది ఇతర వ్యక్తులకు సామాజిక మాధ్యమాల ద్వారా పంపుతున్నారు. అంతేగాకుండా అందరి దృష్టిని ఆకట్టుకునేందుకు వాట్సప్ స్టేటస్ చిత్రంగా ఉపయోగిస్తున్నారు. ఇలాంటి నినాదాలు అందరిని ఆకట్టుకోకపోయిన కొందరైన నీతి, నిజాయితీగా ఓటు వేసేలా దోహదపడే ఆస్కారం కచ్చితంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



సామాజిక మాధ్యమంలో చెక్కర్లు కొడుతున్న నినాదం